# సంస్కారం

మనలో కొందరికి అసాధారణమైన తెలివితేటలుంటాయి... తమపేరు పక్కన కొండవీటి చేంతాడంత పొడవున డిగ్రీలుంటాయి! అయినా... అప్పుడప్పుడూ బుద్ధి గడ్డి తిని... కుళ్ళుబోతుతనంతోనో, ఈర్ష్యా ద్వేషాలతోనో ఎదుటి వాళ్ళ వ్యక్తిత్వాల మీద యథేచ్ఛగా బురద జల్లడానికే ప్రయత్నిస్తారు.

మనకేమీ కాని వాళ్ళు మన గురించి అసందర్భపు ప్రేలాపనలు పేలినా.... కొంత వరకు సరిపెట్టుకుని... వాళ్ళని క్షమించగలమేమోగానీ...

మన ప్రాణానికి ప్రాణంలా మసలుకున్నవాళ్ళు... ఇతరుల ముందు చాటు మాటుగా... మన మీద లేనిపోని పుకార్లు పుట్టించి... గోతులు తవ్వడం...

వినేవాళ్ళు ముక్కు మీద వేలేసుకునేలా...

చెప్పేవాళ్ళ వ్యక్తిత్వాన్ని అసహ్యించుకునేలా.... చేస్తుందన్న స్పృహ... ఆ చెప్పేవాళ్ళకి లేకపోవడమే ఆశ్చర్యకరం !

ఎదుటి వ్యక్తితో 'మంచి'ని నటిస్తూ.... అతడి పరోక్షంలో అతడి గురించి 'చెడు' చెప్పడం.. మన కుసంస్కారాన్ని సూచిస్తే...

మనమీద 'చెడు' చెప్పే వ్యక్తి గురించి కూడా... 'మంచే' చెప్పడం.... మన సంస్కారానికి అద్దం పడుతుంది.

కొందరుంటారు... వాళ్ళు తమకన్నా ముందుగా ఎవరైనా విజయపథంలో దూసుకుపోతున్నారన్న సంగతి తెలిస్తే చాలు... గాసిప్స్‌తోనో, స్కాండల్స్‌తోనో వాళ్లని పడగొట్టే సమయసందర్భాల కోసం కాచుక్కూర్చుంటారు !

ఒక వ్యక్తి విజయాన్ని ఓర్వలేని మనుషులు... అతడి ఇమేజ్‌ని దెబ్బతీసే ప్రయత్నంలో.. నీచపు ఎత్తుగడల్తో.... అతడి వ్యక్తిగత జీవితంలోకి ఎందరెందరో పాపరాజో (Paparazzo) లను సంధించి.... అతడి గుట్టు లాగడానికే చూస్తూ ఉంటారు! ఒకవేళ ఆ ప్రయత్నంలో ఏవీ దొరక్క పోతే... ఏ నీలాపనిందల్తోనో అతడి మనసును అల్లకల్లోలం చేసి ఆనందిస్తారు!

అన్నింటికన్నా వింతైన విషయం... ఇతరుల ఆంతరంగిక విషయాల్ని లొట్ట లేసుకుంటూ వినడానికిష్టపడే 'పెద్ద' మనుషులు... ఇతరులెవ్వరైనా తమ వ్యక్తిగత జీవితాన్ని అదే ఫోర్స్‌తో బజారు కీడ్చినప్పుడు తమ మనసెంత 'చిన్న' బోతుందో... గ్రహించకపోవడం!

ఏదేమైనా...

సరసంలో 'ఆహా-ఓహో' అని ఆకాశానికెత్తేయడం...

విరసంలో 'ఛీపో-పోపో' అని పాతాళానికి తొక్కేయడం.... మన రాగద్వేషాలకి నిదర్శనం!

రాగద్వేషాల్లో 'సంయమనం' పాటించే మనిషి... సంస్కారపు తేజస్సుతో సభ్య ప్రపంచానికి అధినేత అవుతాడు!

01-04-1995